నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 09, 2024 | www.navatelangana.com

పురుగులమందు తాగి బాలిక ఆత్మహత్య

నవతెలంగాణ - కౌటాల



పురుగులమందు తాగి బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బోదంపెల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం..కోట ఈశ్వరి(17) తల్లిదండ్రులు మిరపకాయలు కోయడానికి ఖమ్మం వెళ్లగా ఒక్కతే ఇంట్లో ఉంటోంది. వారం రోజులుగా జ్వరం రావడంతో దిగులుతో నాలుగు రోజుల క్రితం పురుగులమందు తాగింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఖమ్మం నుండి వచ్చి ఆమెను కరీంనగర్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

సొనాల గ్రామ పాలకవర్గ సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-బోథ్



మండలంలోని సొనాల గ్రామ మాజీ సర్పంచ్ చట్లపల్లి సదానందం, పిప్పిల్‌దరి గ్రామ సర్పంచ్ బండారి శ్రీధర్‌రెడ్డితో పాటు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను గ్రామ ప్రజల అధ్వర్యంలో గురువారం సన్మానించారు. గ్రామాలకు చేసిన సేవలను కొనియాడారు. సేవలకు గుర్తింపుగా గ్రామ ప్రజల తరపున చిరు సన్మానం చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజమణి మహిపాల్, సొనాల గ్రామ ప్రజలు గుడాల శేఖర్, సోమన్న, రవి, రాజారాం, గుడాల అనూష, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు గ్రామస్తుల సన్మానం



నవతెలంగాణా-ఇచ్చోడ

ముఖరా(బి) గ్రామపంచాయతిలోని మాన్కుగూడ, రఘుగూడ గ్రామ ప్రజలు సర్పంచ్ అడవ్ మారుతి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించానని తెలిపారు. గ్రామంలో రోడ్లు, పల్లె ప్రకృతి వనం, శ్మశానవాటిక, హరితహారం, మన ఊరు మనబడి పనులు, ప్లేగ్రౌండ్‌తో గ్రామానికి కొత్త కళ తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శివాజీ, గ్రామ కార్యదర్శి, కారోబారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అటవీ శిక్షణ అధికారులకు అవగాహన



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలోని శిక్షణ అటవీశాఖ అధికారులు గురువారం అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో ఎఫ్ఆర్ఓ ప్రణయ్ శిక్షణ అధికారులకు రికార్డులపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక నర్సరీని పరిశీలించి మొక్కలు నాటడం, సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షణ కోఆర్డినేటర్ నాగిని భాను, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రమోద్, శిక్షణాధికారులు పాల్గొన్నారు.

సామగూడలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కాసిపేట: మండలంలోని పల్లంగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని సామగూడలో ఔట్ రిచ్ మ్యాప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సహృదయ కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. డైరెక్టర్లు పాల్విగ్, కరోవిగ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఐదు నెలల పాటు కుట్టు శిక్షణ కేంద్రం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ కళ్లెం జాషువా, రత్నం విజయ్ కుమార్, స్టీవెన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

24వ రోజుకు దీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రజల చిరకాల కోరిక ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ సాధనకు తమ వంతుగా సహకరిస్తామని బీజేపీ నాయకురాలు నివేధిత వర్ఘే అన్నారు. ఆర్అండ్‌బి ఎదుట రైల్వేలైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 24వ రోజుకు చేరుకోగా బీజేపీ నాయకులు ప్రఫూల్ వర్ఘే, నివేధిత వర్ఘే సంఘీభావం తెలిపారు. తొలిసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన సమయంలో జిల్లాకు రైల్వేలైన్ మంజూరు చేయాలని విన్నవించడంతో ముంబై నుంచి నాగ్‌పూర్ నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ రైల్ వచ్చిందని తెలిపారు. అదే తరుణంలో ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే ప్రతిపాదన, డిమాండ్ కూడా వచ్చిందన్నారు. దీన్ని ఎవరూ పట్టించుకోని కారణంగా మరుగున పడిందన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే, ఎంపీలు బీజేపీకి చెందిన వారేనని, కేంద్రంలో కూడా బీజేపీయే ఉందని ఈ సారి రైల్వేలైన్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి చైర్మెన్ నారాయణ, నాయకులు నరేందర్, మహేందర్, శ్రీనివాస్, అప్సర్‌ఖాన్, ఫయాజ్, రఫీక్, రాజు యాదవ్, బండారి దేవన్న పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయించాలి

నార్నూర్ : మదాపూర్‌లో ఐటీడీఏ ద్వారా ఎస్టీఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరైన బీటీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పిఒ ఖుష్బూ గుప్తాను దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ కోరారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో పిఒను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఖంపూర్ నుండి మదాపూర్ వెళ్లే రహదారిపై 108 అంబులెన్స్ రాలేని పరిస్థితి ఉందన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు త్వరగా చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

కలప స్మగ్లర్‌కు రిమాండ్

బోథ్: మండలంలోని దన్నూర్-బి గ్రామానికి చెందిన ఆడే సకారాంను గురువారం రిమాండ్‌కు పంపారు. బుధవారం రాత్రి గ్రామ సమీపంలో అక్రమంగా కలప రవాణా చేస్తుండగా పట్టుకున్నామని డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్ తెలిపారు. రూ.9800 విలవైన టేకు దుంగను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి 14 రోజులు జైలు శిక్ష విధించడంతో రిమాండ్ పంపించినట్లు తెలిపారు.

పీడీఎస్‌యూ మండల కమిటీ ఎన్నిక

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలో గురువారం పీడీఎస్‌యూ కమిటీని జిల్లా కమిటీ సభ్యులు మడావి గణేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఆత్రం అజయ్, ఉపాధ్యక్షులుగా కుంర తరుణ్, భీంరావు, ప్రధాన కార్యదర్శిగా పెందూర్ దీపలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానం, మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు పోరాడుతామని తెలిపారు.

రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కేంద్రం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లంక రాఘవులు
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లంక రాఘవులు అన్నారు. కేరళ ప్రభుత్వం కేంద్రం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ గురువారం బస్టాండ్ ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వానికి, మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లంకరాఘవులు మాట్లాడుతూ నీజాయితీ, ఆదర్శవంతమైన కేరళ ప్రభుత్వాన్ని అస్తిత్వాన్ని తొలగించేలా బీజేపీ కుట్రలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే అక్కడి సీఎంపై లేనిపోని కేసులను పెట్టి ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. అదే విధంగా కేరళలో వరదలు వచ్చిన సమయంలో హెలిక్యాప్టర్‌ల ద్వారా సాయం అందించిన కేంద్రం దానికి రూ.120 కోట్లు అయ్యాయని వాటిని రాష్ట్రం చెల్లించాలని ఉత్తర్వులు పంపిందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలను లెఫ్ట్ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. కేంద్రం వెంటనే తన నిర్ణయాలు మర్చుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆశలత, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, సీఐటీయూ జిల్లా నాయకులు అగ్గిమల్ల స్వామి, దర్శనాల అనిల్, సీపీఐ(ఎం) నాయకులు, ఆశన్న, స్వామి, హరిఫా పాల్గొన్నారు.

వెల్లుల్లి @ 500

- వెక్కిరిస్తున్న వెల్లుల్లి ధరలు
- కొనలేని స్థితిలో సామాన్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సామాన్యులకు కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. రోజురోజుకు ధరలు భారీగా పెరుగుతున్నాయి. మొన్నటివరకు ఉల్లి ధరలు ఘాటెక్కించాయి. ఇప్పుడు వెల్లుల్లి(ఎల్లిగడ్డ) ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. మొన్నటి వరకు టమాట చుక్కలు చూపించగా ప్రస్తుతం వెల్లుల్లి రేట్లు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఉల్లికి తోడుగా ఉండే వెల్లుల్లి ఇప్పుడు బహిరంగ మార్కెట్లో రూ.400 నుండి రూ.500కు కేజీ పలుకుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వెల్లుల్లి ధరలు కొండెక్కాయి. వారం రోజుల క్రితం రూ.200 నుంచి రూ.250 వరకు పలికిన వెల్లుల్లి ఇప్పుడు రూ.500కు పెరగడంతో కొనలేని స్థితిలో సామాన్యులున్నారు. అయితే దీనికి ప్రధాన కారణంగా ఇతర రాష్ట్రాల్లో వెల్లుల్లి దిగుబడి తక్కువ కావడమేనని వ్యాపారులు పేర్కొంటున్నారు. జిల్లాలో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయకుండా వర్షాధారిత పంటలపైనే రైతులు ఎక్కువ మొగ్గుచూపుతున్నారు. దాని కారణంగా నిత్యావసరమైన ఉల్లి, వెల్లుల్లి, అల్లం తదితర వాటిని ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. అయితే గత సంవత్సరం వెల్లుల్లి పండించే రాష్ట్రాల్లో ధరలు లేని కారణంగా ఈ సంవత్సరం సాగుకు రైతులు ముందు రాలేదు. దీంతో ఇప్పుడు వాటి ధరలు విపరీతంగా పెరిగాయి.

డిమాండ్ ఉన్న పంటనే సాగు చేయాలి

డిమాండ్ ఉన్న పంటలను రైతులు సాగు చేయాలని వినియోగదారులు అంటున్నారు. ఒకే పంటలు కాకుండా వేరే పంటలు వేస్తు లాభాసాటిగా సాగుకు మార్చుకోవాలని పేర్కొంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కూడా ఉల్లి, వెల్లుల్లి, ఇతర డిమాండ్ ఉన్న నిత్యావసర పంటల సాగుకు అధికారులు రైతులను ప్రోత్సహించాలని కోరుతున్నారు. కిలో వెల్లుల్లి తీసుకెళ్లే వారు ఇప్పుడు పావు కిలో తీసుకెళ్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వెల్లుల్లి దిగుమతి అవుతుందని వ్యాపారులు అంటున్నారు. అక్కడ దిగుబడి లేని కారణంగా కొరత ఉండడంతో ధరలు పెరిగాయని పేర్కొంటున్నారు. వారం రోజుల నుంచి రోజురోజుకు వెల్లుల్లి ధరలు పెరుగుతున్నాయంటున్నారు. మరో 15 రోజుల వరకు ఇవే ధరలు ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్



నవతెలంగాణ-తలమడుగు

గ్రామాలను పారిశుధ్యంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. గురువారం మండలంలోని భరంపూర్ గ్రామంలో పారిశుధ్య పనులను పర్యావేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సర్పంచుల పదవీకాలం ముగిసినందున గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించామని అన్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో అన్ని గ్రామాలను పారిశుధ్యంగా ఉంచాలని పేర్కొన్నారు. గ్రామంలో వీధుల గుండా తిరుగుతూ మురికి కాలువలను స్వయంగా పరిశీలించారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో లబ్దిదారులు సమగ్ర వివరాలు వెల్లడించలేదని అన్నారు. దరఖాస్తుల్లో గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్స్యూమర్ నెంబర్, రేషన్ కార్డు నెంబర్, వివరాలను పొందుపర్చలేదని అన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ కూడా నష్టపోకూడదనే ఉద్యేశంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పిదాలను సరిచేయుటకు ప్రత్యేక యాప్‌ను రూపొందించిందని అన్నారు. ఈ యాప్ సాయంతో వివరాలను సరిచేయడం జరుగుతుందని అన్నారు. తప్పిదాలను సరిచేసేందుకు మండలాల పరిధిలో తహసీల్దార్‌లు, మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్‌లు ఇతర అధికారుల నేతృత్వంలో సర్వే బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సానిటేషన్ డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. గ్రామపంచాయతీలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. గత సంవత్సరం మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలకు జొన్న, పంటలు దెబ్బతిని, పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారంగా పదివేల రూపాయలు అందిస్తామని, గత ప్రభుత్వం ప్రకటించిన ఇప్పటికీ రైతులకు నష్ట పరిహారం అందలేదని, గ్రామ రైతులు కలెక్టర్‌కు విన్నవించగా సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాకాంత్, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి, గ్రామ పెద్దలు కేదారీశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, రమాకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖాధికారిణిని కలిసిన అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజిరెడ్డి గురువారం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారిణి హిమశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి శాలువతో సత్కరించారు. అనంతరం పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ పొచ్చన్న, సెక్రటరీ అరవింద్, కార్యవర్గ సభ్యులు సాయిబాబా, రవీందర్, విఠల్, భూమన్న, వెంకటగిరి మహేందర్, అరుణ, మహమ్మద్ పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట యువతి బంధువుల ధర్నా



నవతెలంగాణ-ఖానాపూర్

నడిరోడ్డుపై అత్యంత దారుణంగా యువతి అలేఖ్యను హత్య చేసిన నిందితుడు శ్రీకాంత్‌ను ఉరి తీయాలని గురువారం ఆస్పత్రి ఎదుట బంధువులు ధర్నా చేశారు. నిందితుడి కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కరుడుగట్టిన నిందితుడిని సమాజంలో తిరగనివ్వకూడదన్నారు. దీంతో ఒక్కసారి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిందితుడిని పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో బంధువులు, కుటుంబ సభ్యులు శాంతించారు. నిందితున్ని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. కొన్నేండ్లుగా ఇరువురు ప్రేమించుకుంటున్నారని, శ్రీకాంత్ వ్యవహారశైలి నచ్చక యువతి వారించడంతో కక్ష పెంచుకొని ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా



నవతెలంగాణ-ఉట్నూర్

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా వైద్యులను ఆదేశించారు. ఉట్నూర్‌లోని జిల్లా ఆస్పత్రిని ఆమె గురువారం సందర్శించారు. ఆస్పత్రి కి వచ్చే రోగులు, అందిస్తున్న సేవలు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడున్న వసతుల గురించి ఆరా తీసి వైద్యులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. సాధ్యమైనంత వరకు ఇక్కడే వైద్యం అందించేలా చూడాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువ శాతం రక్తహీనతతో బాధపడుతున్న వారే ఉన్నారని, అలాంటి వారికి అవగాహన కల్పించాలన్నారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటు వారి ఆరోగ్య పరిస్థితులపైమ ఆశాల ద్వారా పరీక్షించాలన్నారు. ఎక్కడ కూడా వైద్య పరంగా గిరిజనులకు ఇబ్బందులు కలుగకుండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సమస్యపై ఆరా



నవతెలంగాణ - జైనూర్

మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు నీటి సరఫరా చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం మండలంలోని డబోలి గ్రామంలో గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథతో గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే పంచాయతీ కార్యదర్శితో పాటు స్పెషల్ అధికారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో శుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉదయ్ రాంప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభుదయ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జైనూర్

ఈ నెల 16న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంత ంచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీఐటీయూ మండల కన్వీనర్ తారా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 11న మధ్యాహ్నం 12గంటలకు కాగజ్‌నగర్‌లో బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. దీనికి సీఐటీయూ ఆలిండియా కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, మధు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ పాల్గొంటున్నారని తెలిపారు. దీనికి ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, మధ్యాహ్నభోజన కార్మికులు హాజరై విజవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | ఫిబ్రవరి 09, 2024 | www.navatelangana.com

సర్పంచ్, ఉపసర్పంచ్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-నార్నూర్

సర్పంచ్, ఉపసర్పంచ్ సేవలు అభినందనీయమని బీఆర్ఎస్ జిల్లా నాయకులు జాదవ్ ప్రకాష్ అన్నారు. గురువారం బేతాల్‌గూడ గ్రామపంచాయతీలో పదవీవిరమణ పొందిన సర్పంచ్ జాదవ్ సుజాత పరమేశ్వర్, ఉపసర్పంచ్ పెందూర్ ఇస్తు, వార్డు సభ్యులకు పంచాయతీ కార్యాలయంలో



శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో 5 సంవత్సరాలుగా సర్పంచ్, ఉపసర్పంచ్‌గా ఉండి గ్రామాన్ని అనేక రంగాలలో అభివృద్ధి పరిచారన్నారు. సన్మాన కార్యక్రమంలో గ్రామ పటేల్ బొజ్జు, గ్రామ పెద్దలు రవీందర్, నగేష్, బాదిరావ్, అంబారావ్, బలరాం ఉన్నారు.

ఆదీ మహోత్సవ కార్యక్రమంలో గుస్సాడీ కళాకారులు

నవతెలంగాణ-ఇచ్చోడ

ఢిల్లీలో నిర్వహించనున్న ఆదీ మహోత్సవ కార్యక్రమంలో ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ ప్రముఖ ఆదివాసీ కళాకారుడు కాత్లే శ్రీధర్ డెంస్సా గుస్సాడి బృందం గురువారం ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం తరఫున పిలుపునివ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఆనంద్, తిరుపతి, ప్రవీణ్, భీంరావు, మారుతి, నితిన్, మోతీరాం, దినేష్, సంజీవ్, లక్ష్మణ్, దత్తు, చరణ్, రవికిరణ్ పాల్గొన్నారు.



నాగోబా జాతరకు వేళాయె..!

- పుష్య మాసం రాత్రి నాగోబాకు మహా పూజ
- హాజరు కానున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ ఖుష్బు గుప్తా
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసుల ఆరాధ్య దైవం కేస్లాపూర్‌లోని నాగోబా జాతరకు వేళైంది.అమావాస్య రాత్రి నుంచి మెస్రం వంశీయులు ఇక్కడ మహా పూజకు సమాయత్తమయ్యారు. ఈ నెల 9న మహాపూజతో ఆరంభమయ్యే ఈ జాతర 15 వరకు కొనసాగనుంది. మెస్రం వంశీయులు పదుల కిలోమీటర్ల దూరంలో కాలినడకన వెళ్లి జన్నారం మండలం పవిత్ర గోదావరి హస్తినమడుగు నుంచి సేకరించిన గంగా జలంతో ఈ నెల 6న మండలంలోని ఇంద్రాదేవి వద్దకు చేరుకున్నారు. అదే రోజున కేస్లాపూర్‌లోని మర్రిచెట్టు వద్దకు చేరుకున్నారు. అక్కడ వారి సాంప్రదాయ ప్రకారం తూమ్ నిర్వహించారు. నాగోబా మహా పూజకు తెచ్చిన గంగా జలాన్ని మర్రిచెట్టు పరిసర ప్రాంతంలో భద్రపర్చారు. ఆ గంగా జలంతో నేడు మెస్రం వంశీయులు ఖటోడ మెస్రం కోసేరావ్, ధర్ము హన్మంతు, ల హాస్తంతో వారి సాంప్రదాయం ప్రకారం జలాభిషేకం చేసి నాగోబా జాతరను ప్రారంభిస్తారు. నాగోబా జాతరపై నవ తెలంగాణ ప్రత్యేక స్టోరీ...

నాగోబా మహా పూజ ఇలా..

కేస్లాపూర్‌లోని మర్రిచెట్టు వద్ద గుడారాలు వేసుకొని మెస్రం వంశీయులు బస చేశారు. పూజ రోజున వేకువ జామునే వారి సాంప్రదాయ, వాయిద్యాలైన డోలు, పెప్రే, కాలికొం, వాయిస్తూ నాగోబా ఆలయం వద్దకు చేరుకుంటారు. అదే రోజున సాయంత్రం వేళలో ఎడ్లబండ్లను ఆలయం పక్కనే ఉన్న గోవాడ (బస చేసే చోటు) కు చేరుకొని అక్కడ బస చేస్తారు. అక్కడ మహాపూజకు ముందు నిర్వహించే పూజలను కొనసాగిస్తారు. ముందుగా మర్రిచెట్టు వద్ద నున్న కోనేరు నుంచి మట్టి కుండల్లో మెస్రం అల్లుండ్లు నీటిని తోడుతారు. ఆడపడుచులు కుండల్లో ఆ నీటిని నాగోబా ప్రాంగణానికి తీసుకొని వచ్చి, నాగోబా ఆలయం పక్కనే ఉన్న పాత మట్టి పుట్టలను మెస్రం అల్లుండ్లు తవ్వుతారు. తెచ్చిన నీటితో ఆడ పడుచులు కొత్త పుట్టలను తయారు చేస్తారు. ఆ పుట్టనుంచి మట్టిని ఉండక రూపంలో చేసి ఏడు వరుసలలో పేర్చి భౌల దేవతను చేస్తారు. అనంతరం సతి దేవత భౌవులను తయారు చేసి సాంప్రదాయ పద్ధతిలో పూజలు చేయడం ఆనవాయితీ.

రాత్రి నాగోబాకు మహా జలాభిషేకం..

అమావాస్య రోజున రాత్రి పది గంటల నుంచి తీసుకువచ్చిన గంగా జలంతో ఆలయాన్ని శుద్ధి చేస్తారు. అనంతరం గంగాజలంలో వారి సాంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నాగోబాకు జలాభిషేకం చేసి పూజను ప్రారంభిస్తారు. ఈ పూజకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ఎస్పీతో పాటు ప్రముఖ రాజకీయ నాయకులు హాజరవుతారు.

భేటింగ్ (పరిచయ కార్యక్రమం)....

పూజ అనంతరం అర్ధరాత్రి నుంచి మెస్రం కొడళ్లకు భేటింగ్ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కోడళ్ల వారి కుటుంబ సభ్యులకు పరిచయం చేసి, పెద్దల ఆశీస్సులు పొందుతారు. అనంతరం కొడళ్లకు నాగోబా దర్శనం కల్పిస్తారు. గత ఏడు 200 మెస్రం కోడళ్లు నాగోబా సన్నిధిలో భేటింగ్ అయినట్లు మెస్రం పెద్దలు తెలిపారు.



కితాల వారిగా



పొయ్యిలు..

గోవాడ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు ముగిసే వరకు 22 కితాల (వర్గాలు) వారిగా పొయ్యిలను ఏర్పాటు చేసి దాని పైనే వంటలు చేసి, దేవునికి నైవేద్యాన్ని సమర్పిస్తారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఉపవాస దీక్షను విరమింప చేస్తారు.

పెర్సాపేన్ పూజలు..

జాతర ఆరంభమై రెండో రోజున ఆలయం వెనుక ఉన్న పెర్సాపేన్ దేవునికి వారి సాంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజకు కేవలం పురుషులే చేయడం గమనార్హం.

భాన్ దేవతకు పూజలు...

మూడో రోజున నాగోబా సన్నిధిలో బెటింగ్ అయిన మెస్రం కోడళ్లు మర్రిచెట్టు వద్దనున్న కోనేరు నుంచి తెచ్చిన నీటితో భాన్ దేవతకు పూజలు నిర్వహిస్తారు. ఈ పూజల్లో మహిళ భాగస్వామ్యం అధికంగా ఉంటోంది.

12న నాగోబా దర్బార్...

ఈ నెల 12న జాతరలో ప్రత్యేక దర్బార్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.1946లో ఈ దర్బార్‌ను ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్, బెట్టి ఏలిజబెత్ దంపతులు మొట్టమొదటి సారిగా దర్బార్‌ను ప్రారంభించినట్లు ఆదివాసీ పెద్దలు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఈ దర్బార్ ప్రతి ఏటా నిర్వహిస్తూనే ఉన్నారు.

బేతాల్ పూజలు...

నాగోబా పూజ, దర్బార్ అయిన చివరి రోజు గోవాడ వద్ద మెస్రం వంశీయులు బెతాల్ పూజలు, మండ గాజలింగ్ పూజలు నిర్వహిస్తారు. ఈ పూజకు మెస్రం కోడళ్ల కుల పెద్దలకు కానుకలను సమర్పించి నాగోబా వీడ్కోలు చెబుతారు.

జాతర నిర్వహణకు రూ.50 లక్షలు..

ఈసారి జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, ఐటీడీఏ ద్వారా సుమారు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్టు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ నిధులతో వివిధ శాఖల ఆధ్వర్యంలో తాగునీరు, మరుగుదొడ్లు, టెంట్లు, సానిటేషన్ తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతోంది. ఈ నాగోబా జాతరను ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఈ జాతరకు జిల్లా ప్రజలే గాక మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు.

రూ.6 కోట్లతో నూతన మందిర నిర్మాణం..

ప్రభుత్వం రూ. 6కోట్లతో నూతన మందిర నిర్మాణాన్ని మెస్రం వంశీయులు చేపట్టారు. మెస్రం వంశీయులు విరాళాలను సేకరించి, సైతం ఒక కోటితో మందిర ప్రాకార మండపాన్ని నిర్మించారు. మందిర నిర్మాణానికి ఎలాంటి ఇసుక, స్టీల్ వాడకుండా రాతితో నిర్మించారు. కర్నూల్ జిల్లాలో ఆళ్లగడ్డ నుంచి తెచ్చిన ప్రత్యేక తెల్లటి రాళ్లతో ఈ మందిరాన్ని గత రెండు సంవ్సరాలుగా నిర్మిస్తున్నారు. అయితే ఈ జాతరకు మందిర నిర్మాణం పూర్తైంది.





17లోపు వేతనాలు చెల్లించకపోతే ఆందోళన చేస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ కార్మికులకు ఈనెల 17 లోపు వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో 18 నుంచి ఆందోళన చేపడుతామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. గురువారం రిమ్స్ బ్రాంచ్ ఏఐటీయూసీ అనుబంధం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముజీబ్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో పనిచేస్తున్న సానిటేషన్ సెక్యూరిటీ గార్డ్స్ పేషెంట్ కేర్ కార్మికుల జీఓఎంఎస్ నెంబర్ 60 ప్రకారం ప్రతి కార్మికునికి ప్రతి నెల కార్మికుని అకౌంట్లో రూ.12,093 వేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ రూ.11వేలు ఇస్తూ, రూ.1093 దోచుకుంటున్నారని ఆరోపించారు. అలాగే పీఎఫ్ ప్రతి నెల ప్రతి కార్మికుని ఖాతాలో రూ. 3,023 జమ చేయాలని అన్నారు. కానీ రూ.800 నుంచి రూ.1500 లోపు జమ చేసి మిగతా డబ్బులు దోచుకుంటున్నారన్నారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్ స్పందించి, ఈ నెల 17 తేదీలోపు జీఓ ప్రకారం వేతనాలు పీఎఫ్, ఈఎస్ఐ, కార్మికులకు ఇవ్వకపోతే ఈ నెల 18 తేదీ నుంచి కార్మికులందరు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారని సంబంధిత కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డోంగ్రే చందు, రిమ్స్ బ్రాంచ్ అధ్యక్షకార్యదర్శులు సంగీత, ఖాసీం, కార్మికులు రాము, శిల్ప, గంగు సునీత, రాజేందర్ సింగ్, స్వామి, వెంకటేష్ ఉన్నారు.

విద్యార్థులకు గురుకుల అవగాహన పరీక్ష

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని సేవాదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో గురువారం నాలుగో తరగతి విద్యార్థులకు గురుకుల అవగాహన పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు సేవాదాస్ స్కూల్‌తో పాటు ఆయా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు మొత్తం కలిపి 70 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు పాఠశాల కరస్పాండెంట్ జాదవ్ ఉమాజీ పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని పేద విద్యార్థులు నవోదయ, గురుకుల వార్షిక పోటీ పరీక్షలో మంచి మార్కులు సాధించడానికి గురుకుల అవగాహన పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, ఝాడే మహేందర్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సొంత డబ్బులతో పాఠశాల భవన నిర్మాణం

- అభినవ్ సర్ధార్‌ను అభినందించిన గ్రామస్తులు



నవతెలంగాణ-సిరికొండ

శ్రీమంతుడు అనే సినిమాలో హీరో మహేష్ బాబు ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి ఎలా చేశాడో, ఆలాగే సిరికొండ మండలంలోని మారుమూల గిరిజన గ్రామం కోసు పటేల్‌గూడ గ్రామంలో సినీ ఇండస్ట్రీ యువనాయకుడు అభినవ్ సర్దార్ తన సొంత డబ్బులతో పాఠశాలను నిర్మించి, వారికి కావాల్సిన వసతులను విద్యార్థులకు కల్పించి, వారి కష్టాన్ని తొలగించారు. గత నెల రోజుల కింద ఆ గ్రామాన్ని సందర్శించి, విద్యార్థులు పడుతున్న కష్టాన్ని చూసి చలించిపోయారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు పిల్లలు వణుకుతూ, తడకలతో నిర్మించిన పాఠశాల గదిని చూసి తన సొంత డబ్బులతో పాఠశాలను నిర్మించి ఇస్తానని గ్రామస్తులకు మాటిచ్చారు. మాట ఇచ్చిన ప్రకారం గ్రామంలో ఒక పాఠశాల భవన నిర్మాణాన్ని నిర్మించి, గురువారం మైనారిటీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాథోడ్ రమేష్, డిఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ చేతుల మీదుగా గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ విద్య అనేది మన జీవితంలో అతి ముఖ్యమైనదని అన్నారు. తన సొంత డబ్బులతో పాఠశాల భవనాన్ని నిర్మించి, ఇవ్వడం చాలా గొప్పదని అన్నారు. జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి రాథోడ్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్య కోసం ఎంతో ఖర్చు చేస్తున్నాయని అన్నారు. నూతనంగా ఏర్పడిన కోసు పటేల్‌గూడ గ్రామానికి ప్రభుత్వం నుంచి అన్ని రకాల సదుపాయాలు అందే విధంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని అన్నారు. సమాజ సేవ చేయాలనే ఉద్యేశంతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించి ఇవ్వడం చాలా గొప్పవిషయమని అన్నారు. సినీ ఇండస్ట్రీ యువనాయకుడు అభినవ్ సర్దార్ మాట్లాడుతు నేను మా ఊళ్లో చిన్నప్పుడు చదివుకునే సమయంలో అనేక కష్టాలను అనుభవించానని అన్నారు. పేదింటి పిల్లలు చలికి వణుకుతూ చదువుకుంటున్నారనే విషయాన్ని తన స్నేహితుల ద్వారా తెలుసుకొని, వారి కష్టాలను తొలగించాలని భావించి నాకు తోచిన సాయంగా పాఠశాల భవనాన్ని నిర్మించానని అన్నారు. విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. విద్య ఉంటే ఏదైనా రంగంలో రాణించవచ్చని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, ఇన్‌చార్జీ మండల వ్యవసాయ అధికారి కైలాస్, నాయకులు, గ్రామస్తులు పెంటన్న, బషీర్, రావుజి పటేల్, యాదవ్‌రావ్, జనార్ధన్, పాఠశాల ఉపాధ్యాయుడు ఆత్మరామ్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర కొండపై సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ వెంకటేశ్వర ఆలయానికి వెళ్లే రహదారికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.20లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరంపూర్ గ్రామస్తుల కృషితో పాటు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. గ్రామాలాభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు సహకరిస్తేనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అనంతరం మండలంలోని చర్లపల్లి ఝరి, పూనగూడ, మందగూడ, దేగాం, కోసాయి,పల్సి(బి), దేవాపూర్, కప్పర్‌దేవి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. భరంపూర్ గ్రామస్తులు నాయకులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, వెంకట్ యాదవ్, గ్రామస్తులు కేదారీశ్వర్‌రెడ్డి, ప్రతాప్, మల్లారెడ్డి, బర్కం మల్లేష్, తిరుపతి, బాపూరావు, రాజు పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థికి రాష్ట్రపతి ఆహ్వానం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని హర్కాపూర్, అంద్‌గూడకు చెందిన గిరిజన విద్యార్థిని రేష్మ బందుకేకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆహ్వానం అందింది. విద్యార్థిని జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల బాలికలలో 9వ తరగతి చదువుతోంది. ఇటీవల జనవరి 26న నిర్వహించిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ పాఠశాలకు చెందిన రాష్ట్రంలోని ముప్పై మంది విద్యార్థినులకు రాష్ట్రపతి ఆహ్వానం పలికింది. దాంట్లో మండలానికి చెందిన గిరిజన విద్యార్థిని ఉంది. గురువారం ఆ విద్యార్థినికి సర్పంచ్ కుడె కైలాస్, ఉపాధ్యాయ బృందానికి గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

పింఛన్ డబ్బులు అందించాలి



నవతెలంగాణ-కుభీర్

పింఛన్ డబ్బులు అందించాలని గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తూము లక్ష్మీబాయికి వినతిపత్రాన్ని పింఛన్ లబ్దిదారులు అందించారు. ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ డబ్బులు ప్రభుత్వం విడుదల చేసి మూడు రోజులు అయినప్పటికీ గ్రామంలో చాలా మందికి పింఛన్ డబ్బులు అందడం లేదని పలువురు పేర్కొన్నారు. పోస్టాఫీస్‌లో ఆన్‌లైన్ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ గడువును పెంచి పింఛన్ డబ్బులు అందించాలని కోరారు.

దూపదీప నైవేద్య అర్చక అధ్యక్షునికి ఘన సన్మానం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ధూప దీప నైవేద్య అర్చక జిల్లా అధ్యక్షునిగా దేగామ యోగేష్ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మండలంలోని న్యూలోలం గ్రామ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు, మిత్ర బృందం, నాయక్ పోడ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరారు. కార్యక్రమంలో వెంకగారి భూమయ్య, మంద మల్లేష్, డీఎస్ మధు, జాన్ సత్యం, మొసలి చిన్నయ్య, ఒడ్డి కిష్టయ్య చుంచు శ్రీనివాస్, సాకి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 15న సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బంజారా యువసేన మండల అధ్యక్షుడు జాదవ్ దత్త ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం మీడియాతో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ గిరిజన ప్రజలకు ఎన్నో మార్గదర్శకాలు చూపి ఆదర్శంగా నిలిచారని గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడని అన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన డీఈఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని జందాపూర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ ప్రణీత పరిశీలించారు. గురువారం పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరు, మెనూను పరిశీలించి సూచనలు చ ఏశారు. నాణ్యత లోపించకుండా విద్యార్థులకు పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయశీ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ ఆవిష్కరించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో డిడిని ఉపాధ్యాయ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. ఉపాధ్యాయులు విధులను సక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధనలు చేయాలని డిడి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆడే ప్రకాష్ నాయక్, ఆడే విశ్వనాథ్ నాయక్, ఉపాధ్యాయులు జాదవ్ సురేష్ నాయక్, రాథోడ్ గజేంద్ర నాయక్, ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 09, 2024 | www.navatelangana.com

పారదర్శకంగా కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోలీస్ కానిస్టేబుల్‌కు ఎంపికైన అభ్యర్థుల వైద్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసత్రిలో సోమవారం పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రారంభమైన వైద్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 237మంది పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల మెడికల్ టెస్ట్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణాప్రతాప్, ఆర్ఐ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె వాహనాల దరఖాస్తుల గడువు పొడిగింపు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని వివిధ గనులు, డిపార్టుమెంట్లలో యూనిట్ రేట్ సిస్టం ప్రకారం అద్దె ప్రాతిపదికన మూడు సంవత్సరాల పాటు వినిగించేందుకు(8) 2డబ్ల్యూడీ, 4డబ్ల్యూడీ(వీల్‌డ్రైవ్) వాహనాల కోసం ఆసక్తి గల వారు దరఖాస్తులు సింగరేణి యాజమాన్యం కోరిందని, ఉపరితల గనుల్లో నడిచే వాహనాల కోసం కొత్త రేట్లు వర్తించనున్నందున మొత్తం తొమ్మిది వాహనాల టెండర్ దరఖాస్తుల గడువును ఈ నెల 10వ సాయంత్రం ఐదు గంటల వరకు పొడగించారు. కాగా ఇతర విభాగాల గనులు కాకుండా మిగతా విభాగాల్లో నడిచే వాహనాలకు గతంలో ఉన్న రేట్లే వర్తిస్తాయి. ఇందుకు గాను బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి ప్రాజెక్టుల కోసం భూ నిర్వాసితుల కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, పూర్తి వివరాల కోసం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో లేదా కంపెనీ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్‌సీసీఎల్‌ఎంఐఎస్‌ఈఎస్‌సీసీఎల్ మైన్ ఎంఐఎస్‌ఈసీ.కం.ను సంప్రదించాలని సింగరేణి యాజమాన్యం సూచించింది.

ప్రకృతి వనం.. అధ్వానం

- నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు
- వెళ్లేందుకు ఆసక్తి చూపని జనం
- పంచాయతీలకు భారంగా సంరక్షణ
- ప్రత్యేక అధికారుల పాలనలో మెరుగయ్యేనా..?

నవతెలంగాణ-కెరమెరి

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పల్లె ప్రకృతి వనాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. నిర్వహణ సరిగ్గా లేక నిరుపయోగంగా ఉంటున్నాయి. కెరామెరి మండలంలో పచ్చని చెట్లతో ప్రజలకు ఆహ్లాదాన్ని ఇవ్వాల్సిన ప్రకృతి వనాలు చెత్త చెదారం, ఎండిపోయిన మొక్కలతో నిండి ఉన్నాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు వృథాగా ఉన్నాయి. గ్రామాల్లో, ఊరికి దూరంగా, కొన్నిచోట్ల కొండలు, గుట్టల మధ్య ఏర్పాటు చేశారు. దీంతో పల్లె ప్రకృతి వనాలకు వెళ్తే ఆహ్లాదం మాట పక్కన పెడితే ఆయాసం వచ్చే పరిస్థితి ఉందనే విమర్శల కారణంగా అటు వైపు జనాలు కూడా వెళ్లడం లేదు. వనాల నిర్వహణ గ్రామ పంచాయతీలకు భారంగా మారిందని పలువురు వాపోతున్నారు.

నిర్వహణ కరువు.. రాని జనం..

ప్రకృతి వనాల్లో కలుపు తీయడంతో పాటు మొక్కల సంరక్షణ, నీటి నిర్వహణ వంటి పనులకు ప్రతి నెల రూ.5వేల నుంచి రూ.6వేల వరకు ఖర్చవుతున్నట్లు తెలుస్తోంది. వేసవి సెలవులకు గ్రామాలకు వచ్చే విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళలో కాసేపు పల్లె ప్రకృతి వనంలో సేదతీరుదామని అనుకున్నా అక్కడి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఆహ్లాదం పంచని పల్లె ప్రకృతి వనాలు ఎందుకు ఏర్పాటు చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి చేశామని చెప్పుకోవడానికి తప్పా ఏమి ప్రయోజనం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నిర్వహణ లేక అధ్వానంగా కెరామెరిలోని పల్లె ప్రకృతి వనం

జన సంచారం లేని చోట వనాలు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆహ్లాదం పంచడానికి గత ప్రభుత్వం మూడేళ్ల కింద పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి గ్రామంలో ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలని ఇందుకోసం ప్రభుత్వ భూములను గుర్తించి ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో



పలు గ్రామాల్లో భూములను గుర్తించి పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఊరికి మధ్యలో కాకుండా శివారు, కొండ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు కోసం పంచాయతీ నిధులతో పాటు ఉపాధిహామీ పథకాన్ని వినియోగించుకున్నారు. పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటడానికి కావాల్సిన గుంతలు తీయడానికి, నాటిన మొక్కల నిర్వహణ కోసం ఉపాధిహామీ పథకంలో పనులు చేపట్టారు. నేల చదును చేయడం, అవసరం ఉన్నచోట మట్టి పోయడం, పంచాయతీ నర్సరీలో ఉన్న మొక్కలు కాకుండ ఆహ్లాదం పంచడానికి కావాల్సిన మొక్కల కొనుగోలుకు పంచాయతీల నిధులు కేటాయించారు. ఒక్క పల్లె ప్రకృతి వనం కోసం రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఖర్చు చేశారు.

పంచాయతీలకు భారం..


గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల నిర్వహణ గ్రామ పంచాయతీలకు భారంగా మారింది. మూడేళ్ల కింద నిర్మాణ సమయంలో రెండేళ్ల పాటు ఉపాధిహామీ కూలీలతో నిర్వహణ చేపట్టారు. ప్రస్తుతం ఉపాధిహామీ నుంచి నిధులు కేటాయించకపోవడంతో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పంచాయతీలకు భారంగా మారింది. పల్లె ప్రకృతి వనంలో కలుపు తీయడంతో పాటు మొక్కల సంరక్షణ, నీటి నిర్వహణ వంటి పనులకు ప్రతి నెల రూ.5వేల నుంచి రూ.6వేల వరకు ఖర్చు అవుతుంది. నిర్వహణకు ప్రభుత్వం ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో పంచాయతీ నిధులతో నిర్వహణ చేపట్టడం భారంగా మారింది.



జోడేఘాట్‌లోని బృహత్ ప్రకృతి వనం శిలాఫలకం వద్ద ఎండిపోయిన మొక్కలు

జోడేఘాట్ బృహత్ ప్రకృతి వనం దుస్థితి..

ఆదివాసుల అమరవీరుడు అసువులు బాసిన పోరుగడ్డ జోడేఘాట్‌లో ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియం సమీపంలో గత మూడేళ్ళ క్రితం బృహత్ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. 18 వేల మొక్కలు నాటినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గతేడాది మొక్కలు లేని చోట మరో 4 వేల మొక్కలు నాటినట్లు ఈజీఎస్ అధికారులు లెక్కలు చెబుతున్నాయి. నాటిన మొక్కలకు సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం మొక్కలన్ని ఎండిపోతున్నాయి. కలుపు తీయక పోగా ప్రకృతి వనమంతా గడ్డిమొక్కలతో నిండిపోయింది. అధికారుల లెక్కల ప్రకారం బృహత్ ప్రకృతి వనంలో వేల మొక్కలు నాటినట్లు చెబుతున్నా.. గతంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్ర స్థాయిలో పరిశీలించినపుడు సుమారు 9వేల మొక్కలు ఉన్నట్లు వెల్లడించారు. నాటిన మొక్కలను సంరక్షించే చర్యలు చేపట్టాల్సింది పోయి, పశువులే మొక్కలను తినివేశాయని సామాజిక ప్రజా వేదికలో ఉన్నతాధికారుల సమక్షంలో చెప్పడం కొసమెరుపు.



జోడేఘాట్‌లోని ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు, గడ్డి



జోడేఘాటలోని బృహత్ పల్లెప్రకృతి వనంలో ఎండిపోయిన గడ్డి

లక్షలు వెచ్చించి లక్ష్యం మరిచారు

- పెందూర్ రాజేశ్వర్



లక్షలు వెచ్చించి బృహత్ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. వేల సంఖ్యలో మొక్కలు నాటినప్పటికీ వాటి సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మొక్కలు ఎండిపోయాయి. ప్రకృతి వనంలో గడ్డి మొక్కలను తొలగించకపోవడంతో గడ్డి మైదానంలా మారింది. వేసవి కాలం సమీపిస్తుంది. ఎండిన గడ్డితో అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే గ్రామానికి ముప్పు వాటిల్లే ప్రమాదం నెలకొంది. ప్రమాదం చోటుచేసుకోకముందే అధికారులు చర్యలు చేపట్టాలి.

ప్రకృతి వనాలను సుందరంగా తీర్చిదిద్దాలి

- ఆవునూరి రవీందర్



ప్రకృతి వనాలన్నీ ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. విద్యార్థులు, ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేలా ఏర్పాటు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల మొక్కలు ఎండిపోతున్నాయి. కాలక్షేపం కోసం ఎవరు వెళ్లడం లేదు. లక్షలు వెచ్చించి నిర్మించినటువంటి ప్రకృతి వనాలను పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రకృతి వనాలను సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలి.

జాతీయ స్థాయి అత్యపత్య పోటీలకు జిల్లా విద్యార్థి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయస్థాయి అత్యపత్య పోటీలకు జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికయ్యారు. హెచ్ఎం సిస్టర్ మేరీ, కరస్పాండెంట్ సిస్టర్ ఝాన్సీ, పీఈటీ రాకేష్ ఎంపికైన విద్యార్థి బొమ్మన సైవర్ధన్‌ను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా తరపున మందమర్రిలో జరిగిన రాష్ట్రస్థాయి అత్యపత్య ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 9 నుంచి 11 వరకు మహారాష్ట్రలోని సేవగ్రాంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటారని మరిన్ని అత్యుత్తమ టెక్నిక్స్ విద్యార్థికి అందించడం జరుగుతుందని తెలిపారు. జాతీయస్థాయిలో జిల్లా పేరును నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు కిరణ్, అర్చన, ఉపాధ్యాయులు శైలజ పాల్గొన్నారు.

బడీడు పిల్లల ఆన్‌లైన్ వివరాల పరిశీలన



నవతెలంగాణ-కౌటాల

బడిఈడు పిల్లల ఆన్‌లైన్ వివరాల పరిశీలనను మండల విద్యాధికారి డి.సోమయ్య ఆధ్వర్యంలో ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో కౌటాల, చింతలమానెపెల్లి ప్రభుత్వ, ఎఈడెడ్, ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను పరిశీలించినట్లు మండల విద్యాధికారి సోమయ్య తెలిపారు. ప్రతి పాఠశాలలోని ఆన్‌లైన్, రిజిష్టర్‌లో వివరాలు సమానంగా ఉండాలని, ఆన్‌లైన్‌లో లేని పిల్లల వివరాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముత్తంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు, కౌటాల, చింతలమానెపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నారాయణసింగ్, జైరాజ్, సీఆర్‌పీలు జి. ప్రకాష్, మహేష్, దేవన్న, సీసీఓ సుమన్, ఎంఐఎస్ బల్లాజీ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాండ్ల తెలికులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గాండ్ల తేలి కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని గాండ్ల తేలికుల సంఘం సమన్వయ కమిటీ అధ్యక్షులు సంగెం రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన అఖిల గాండ్ల తేలికల సంక్షేమ సంఘం ఐక్యత అభివృద్ధి సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గాండ్ల, తేలి కులస్తులు ఎక్కువగా ఉన్నారన్నారు. పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాంకిడి మాజీ సర్పంచ్ బండె తుకారం, రాష్ట్ర యువజన అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు హిర్రె సందీప్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సెండే మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కవల్కర్ యాదవ్, బాబాపూర్ గ్రామ అధ్యక్షులు కవల్కర్ ఆనందరావు, దస్నాపూర్ ఉపాధ్యక్షులు తపసే పొచ్చన్న, నాయకులు కవల్కర్ ఉద్ధవ్, కవల్కర్ రవిందర్, హిర్రె శ్రవణ్, కవల్కర్ సురేష్, కులస్తులు పాల్గొన్నారు.

హక్కుల కోసం నిరంతర పోరాటాలు

రెబ్బెన : కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందనిగోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భయ్య మొగిళి పాల్గొన్నారు. గురువారం గోలేటిలోని ఓ ఫంక్షన్ హాలులో గోలేటీ సీహెచ్‌పీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నిరంతరం పోరాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుంటుందన్నారు. సింగరేణి కార్మికులు ఏఐటీయూసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో మనకు పట్టంకట్టడం జరిగిందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. మెనిఫెస్టోలో పెట్టిన 49 అంశాలను దశల వారీగా సాధిస్తామన్నారు. అనంతరం గోలేటి సీహెచ్‌పీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీహెచ్‌పీ ఫిట్ కార్యదర్శిగా ఎంబటి రామయ్య, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, ఏ షిఫ్టు ఇన్‌చార్జిగా అమర్‌సింగ్, బి షిఫ్టు ఇన్‌చార్జిగా చంద్రయ్య, సీ షిఫ్టు ఇన్‌చార్జిగా కుసుమ శ్రీనివాస్, జనరల్ షిఫ్టు ఇన్‌చార్జిగా ఎండీ అదామ్‌సమీ, అలాగే మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులను కూడా ఎన్నుకున్నట్టు వారు ప్రకటించారు. ఈ సమావేశంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, శేషు, శివరావు, కిరణ్‌బాబు, జూపాక రాజేష్, ఉయిక చంద్రశేఖర్, సముద్రాల ఆనంద్, దివాకర్, ఫిట్ కార్యదర్శులు అశోక్, రామయ్య, నాయకులు శ్రీనివాస్, గజ్జెల రాజయ్య, సురేష్ కోరి, వేణుగోపాల్, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

వీటీజీ సెట్ పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గురుకులాల్లో ఐదవ తరగతి ప్రవేశానికి ఈ నెల 11న నిర్వహించే వీటీజీ సెట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. గురువారం వీటీజీ సెట్-2024 నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన, వెనుకబడిన తరగతుల, సాంఘిక సంక్షేమ గురుకులాలలో 5వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఆసిఫాబాద్‌లో 5, రెబ్బెనలో 1, సిర్పూర్ (టి)లో 3 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 11న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, దానికాగుణంగా పరీక్ష కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయాలని, ఫర్నిచర్, ఫ్యాన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు ఇతర సదుపాయాలు కల్పించి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోనికి సెల్ ఫోన్‌లను అనుమతించరాదని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష రాసే విధానాన్ని అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్సీఓ స్వరూపారాణి, గిరిజన సంక్షేమ గురుకులాల ఆర్సీఓ గంగాధర్, జిల్లా సమన్వయకర్త బాలరాజు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లాలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో పరిశుభ్రమైన గ్రామపంచాయతీల ఏర్పాటులో భాగంగా చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఈ నెల 15 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రామాలలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు క్లోరినేషన్ చేసి శుభ్రపరచాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలలో ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం వహించకుండా పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పారిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.

13న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా సదస్సు విజయవంతం చేయండి

- జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

ఈ నెల 13న ఆసిఫాబాద్‌లోని ఎస్ఎం గార్డెన్స్‌లో నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి కోరారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య, గౌరవ అతిథులుగా డీఈఓ పార్సి అశోక్ హాజరవుతారన్నారు. ప్రభుత్వ విద్యారంగ సవాళ్ళ, పరిష్కారం దిశగా చర్చ జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం ప్రతినిధుల సభ నిర్వహించడం జరుగుతుందని, ఉపాధ్యాయ సమస్యలు వాటి పరిష్కారం, పోరాటాలు, సంఘ నిర్మాణం, భవిష్యత్తు కర్తవ్యాలు నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ అన్ని యాజమాన్యాల గురుకుల, కేజీబీవీ, యుఆర్ఎస్, ఆశ్రమ, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్, పుల్లూరు బాలకృష్ణ, మండల బాధ్యులు స్వాతి, స్నేహిత, అనుష, శిరీష పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల, సాయిగోపాల్ పాఠశాల విద్యార్థులకు గురువారం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యసిబ్బంది కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. కుష్టువ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులు చర్మం ఏవైనా మచ్చలు కనిపిస్తే తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేసుకోవాలని హెచ్ఈఓ రవిదాస్ అన్నారు. ఆయనతో పాటు ఏఎన్ఎం రుక్మిణి, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ జ్యోతి సమాచార సేకరణకు సహకరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు అందించనున్న గృహ జ్యోతి పథకానికి సంబంధించి సిబ్బంది చేస్తున్న సమాచార సేకరణకు ప్రజలు సహకరించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి వాసుదేవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిబ్బంది సమాచార సేకరణకు వచ్చినప్పుడు ప్రజాపాలన దరఖాస్తు రసీదు, ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు)నెంబర్, ఆధార్ కార్డు నెంబర్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏదైనా కారణం వల్ల మా సిబ్బంది వచ్చినపుడు అందుబాటులో లేనట్లయితే పైన తెలిపిన వివరాలను మీ దగ్గరలో గల విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో కాని లేదా విద్యుత్ సహాయ గణక అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఈ-కేవైసీని నెల చివరిలోపు పూర్తిచేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని రేషన్‌కార్డు లబ్ధిదారులు కుటుంబసభ్యుల వివరాలతో ఈ-కేవైసీ చేసుకోవాలని తహసీల్దార్ రహీమొద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే చాలామంది వివిధ కారణాలతో రేషన్ దుకాణాలకు వెళ్లలేక పూర్తికావడంలేదని, ఈ-కేవైసీ చేయకపోతే కార్డు లబ్ధిదారులకు బియ్యం తొలగించడం జరుగుతుందన్నారు. ఈ నెల చివరి వరకు ఈ-కేవైసీ చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు.

పరీక్ష కేంద్రానికి సకాలంలో హాజరు కావాలి

నవతెలంగాణ-రెబ్బెన

సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హత పరీక్షకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని టీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ జేసీ ప్రిన్సిపాల్ జ్యోతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11 ఉదయం తొమ్మిది గంటలకు మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల పరీక్ష కేంద్రం ఉందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 7995010577కు సంప్రదించాలని ఆమె కోరారు.

అటవీ ఉత్పత్తులతో అభివృద్ధి చెందాలి

నవతెలంగాణ-జన్నారం



అటవీ ఉత్పత్తులతో గిరిజనులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని స్వచ్ఛంద సంస్థ నాయకులు కొమ్రం విఠల్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఇంద్రకాంతిపథకం కార్యాల యంలో జరిగిన కొలాం, తోటి కులాల గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా విఠల్‌రావు మాట్లాడుతూ ఆర్థికంగా ఎదగడానికి అటవీ ఉత్ప త్తులు ఎంతగానో ఉపయోగపడతాయని, దళారుల ప్రమేయం లేకుండా అభివృద్ధి చెందడానికి వందన్ వికాస్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులో ఎ వసంత్‌రావు, డీటీడీఓ గంగారాం, ఐకేపీ ఏపీఎం సీహెచ్ బుచ్చన్న, సీసీలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల కన్వీనర్‌కు సన్మానం

నవతెలంగాణ-జన్నారం



సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ కన్వీనర్ జాడి గంగాధర్‌ను గురువారం మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ అధ్వర్యంలో జర్నలిస్టులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. గంగాధర్ 5 సంవత్సరాల పదవికాలంలో తిమ్మాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాడని భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి గాజుల లింగన్నగౌడ్, గౌరవ అధ్యక్షుడు మందపెల్లి కాంతయ్య, ముఖ్య సలహదారులు పూదరి సత్యనారయణ, ప్రచార కార్యదర్శి జాడి వెంకట్, కోషాధికారి శీల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించండి



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల పట్టణంలోని రాముని చెరువుకి ఉత్తరం వైపున మాస్టర్ ప్లాన్ వంద ఫీట్ల రోడ్డుపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్వచ్ఛంద పౌర సేవా సంస్థ రాముని చెరువు వాకర్స్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. రోడ్డు మధ్యలో ఒక వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్నాడని వారం రోజులుగా పనులు రాత్రిపూట కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు. ప్రజల ఆస్తిని కబ్జా చేయాలని చూసిన వారిపై సివిల్, క్రిమినల్ కేసులు పెట్టాలని విన్నవించారు. 100 ఫీట్ల రోడ్డు హద్దులు నిర్ధారిస్తూ పిల్లర్స్ ఏర్పాటు చేసి దురాక్రమణలు నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద పౌరసేవా సంస్థ అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, రాముని చెరువు కట్ట వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి మొగిలి తిరుపతి, సభ్యులు రంగు రాజేశం, కైలాసం, రాధేశ్యాం, మహమ్మద్ పాషా, రవూఫ్, అంజయ్య, రాజు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనుల పట్ల నిర్లక్ష్యం తగదు

- పనులను పరిశీలించిన డీపీఓ వెంకటేశ్వర్‌రావు



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల్లో ఈ నెల 15 వరకు చేపటాల్సిన ప్రత్యేక పారిశుధ్య పనుల పట్ల నిర్లక్ష్యం తగదని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. పరిధిలో పనుల నిర్వాహణ తీరును స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. భీమారంలో మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల ఆన్‌లైన్ తీరు పరిశీంచిన డీపీఓ భీమారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. భీమారం ఎంపీడీఓ శ్రీనివాస్ రావుతో కలిసి పనులను పరిశీలించిన ఆయన మహా లక్ష్మి పథకం కోసం అందిన ధరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ప్రత్యేక కార్యక్రమం ద్వార చేపట్టిన పారిశుధ్యపు పనులు యధావిధిగా కొనసాగాలని ఆదేశించారు.



జన్నారం : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జన్నారం మండల డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, తపాలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ నైనాల తిరుపతి అన్నారు. గురువారం గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు నీటి కాలువలను శుభ్రం చేసి, పిచ్చి మొక్కలను తొలగించారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

శ్రమ దానం చేసిన అధికారులు

మండలంలోని పోన్కల్ గ్రామంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం వారు గ్రామంలోని మహిళలకు తడి పొడి చెత్త లపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో శ్రమదానం నిర్వహించి పిచ్చి మొక్కలను తొలగింప చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ ఈఓపీఆర్డీ రమేష్ పోన్కల్ ఈఓ, రాహుల్ అంగన్‌వాడీ, ఐకేపీ గ్రామ పంచాయతీ పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

చిత్రకళా ప్రదర్శనకు ఎంపికైన మండలవాసి

నవతెలంగాణ-జైపూర్



ఈ నెల 10 నుండి 16 వరకు హైదరాబాద్ సాలార్జంగ్ మ్యూజియంలో నిర్వహించనున్న చిత్రకళా ప్రదర్శనకు జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన చిత్రకారుడు చిప్పకుర్తి శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చిత్రకారులు అంజి అకొండి వారు మాస్టర్ స్ట్రోక్-3 చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తుండగా ఇందులో జిల్లా నుంచి చిప్పకుర్తి శ్రీనివాస్ పాల్గొననున్నారు. ఈ చిత్రకళా ప్రదర్శనకు ప్రముఖ చిత్రకారులు ఇరు రాష్ట్రాల నుంచి హాజరవుతుండగా ఇలాంటి చిత్రపదర్శనల్లో చిప్పకుర్తి శ్రీనివాస్ పలుమార్లు ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేసి బీఎఫ్ఏ, టీటీసీ పట్టా పొందారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో పాల్గొనడంతో పాటు పలు సినిమాలకు పేయింటింగ్స్ అందించారు.

ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్న వారికి

ఇంటి పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వ ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూకబ్జాదారుల అక్రమ పట్టాలు రద్దు చేయాలని, నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివాసమైవుంటున్న వారందరికి తక్షణమే పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎన్నికలకు ముందు ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల చొప్పున ఇంటి నిర్మాణం కోసం ఇక్కడి పేదలకు ఆర్థికంగా సహాయం చేయాలని అన్నారు. గత సంవత్సర కాలంగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇంటి స్థలాల కోసం పోరాడుతున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని జిల్లా కమిటి సభ్యులు బొడంకి చందు కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పి మోసం చేసిన గత ప్రభుత్వాన్ని గద్దెదించి కాంగ్రెస్కు పట్టం కట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, కన్వీనర్ ఉమారాణి, కమిటి సభ్యులు నగేష్, రేణుక, సమ్మక్క, మణి, సరిత, ఎల్లక్క సరిత, నాగజ్యోతి, కరీంబీ, పోసక్క, మంజుల, సరిత పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు, మతతత్వ విధానాలు తిప్పికొట్టేందుకు ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య కోరారు. కార్మిక హక్కులను కాలరాస్తూ 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతం ఇవ్వాలని, స్కీమ్ వర్కర్స్, వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు. కర్షక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె గ్రామీణ భారత్ బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. భారత్ బందు విజయవంతం చేయాలని అన్ని కార్మిక సంఘాలు, కూలీలు, రైతులు, ప్రజా సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండారి రాజేశ్వరి, మణి, సహన బేగం, రేణుక, నాగజ్యోతి, అనసూర్య, ఉమారాణి, యామిని, సమ్మక్క, మంజుల సరిత పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్లకు సన్మానం



చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రామకష్టాపూర్

కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్, చైర్మన్, వైస్ చైర్మన్లను ఘనంగా సన్మానించారు. ఇటీవల క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డిలపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయి క్యాతనపల్లి మున్సిపాలిటీని హస్తం గతం చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన పలు కౌన్సిలర్లను సన్మానించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ చైర్మన్, వైస్ చైర్మన్లకు మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మున్సిపల్ అధికారులు పూల మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం

సింగరేణి ఉద్యోగాలలో స్థానికులకే 80 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, అలాగే సింగరేణిలో 441 కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందజేసినదుకు హర్షం వ్యక్తం చేస్తూ పట్టణ కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రఘునాథ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, జిల్లా అధికార ప్రతినిధి ఒడ్నాల శ్రీనివాస్, అబ్దుల్ అజీజ్, మాజీ ఎంపీపీ మహంకాళి శ్రీనివాస్, నీలం శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, సీనియర్ నాయకులు మహిళా నాయలురాళ్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి



డంపర్‌లను ప్రారంభిస్తున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

ఆధునిక యంత్రాలతో ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించవచ్చని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం శ్రీరాంపూర్ కోసి నందు శావేల్, మూడు డంపర్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ శావేల్ 6.5 ఎం కెపాసిటీ, 760 హెచ్‌పీ సామర్థ్యం కలిగిందని దీని విలువ 4.63 కోట్లు ఉంటుందన్నారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ఉద్యోగులు ఉత్పత్తిలో, ఉత్పాదకతలో, రక్షణలో ముందుంటారని తెలిపారు. దీనికి కారణం మంచి పారిశ్రామిక సంబంధాలు ఉండటమేనని తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌కు కావాల్సిన యంత్ర సామగ్రిని ఎప్పటికప్పుడు సమకూర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తంరెడ్డి, గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైద, శ్రీరాంపూర్ అధికారుల సంఘం వైస్ ప్రెసిడెంట్ వేంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ సుధీర్ జక్కుల్ వార్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి నల్లపు సత్తయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఇంజనీరు శ్యాం సుందర్ రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ బి.శంకర్ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్



నవతెలంగాణ-జన్నారం

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ జన్నారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద, సేవాలాల్ జయంతి ఉత్సవ కర పత్రాలను విడుదల చేశారు. ఈ నెల 18న సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను, బంజారా జాతి ముద్దుబిడ్డలు ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. బోర్ బండార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లకావత్ నందునాయక్, కార్యదర్శి పవార్ దినేష్ నాయక్, బానవత్ రాములు నాయక్, సందేశ్ నాయక్, ఉత్సవ కమిటీ ఉప అధ్యక్షుడు జరుపుల ధర్మ నాయక్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ను సన్మానించిన వయో వృద్ధులు

జైపూర్ : మండల పరిధి షెట్‌పల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మేడి రవిని గ్రామానికి చెందిన వయోవృద్ధులు ఘనంగా సన్మానించారు. ఐదు సంవత్సరాల పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచ్ రవిని గురువారం పంచాయతీ కార్యాలయంలో కలిసిన వారు గ్రామ ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేశారు. సర్పంచ్‌గా గ్రామ పంచాయతి ప్రజలతో మమేకమై గ్రామాభివృద్ధికి పాటుపడిన తీరు అభినందనీయమని పేర్కొన్నారు. వయోవృద్ధుల చూపించిన ఆదరాభిమానాలకు ఈ సందర్భంగా మేడి రవి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే వివేక్ చొరవతో స్థానికులకు సింగరేణి ఉద్యోగాలు



నవతెలంగాణ-జైపూర్

స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చొరవతో సింగరేణిలో స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు లభించనున్నాయని మండల కాంగ్రెస్ నాయకులు ఫయాజోద్దీన్, రిక్కుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఏకకాలంలో 441 మందికి సింగరేణి వారసత్వ ఉద్యోగాలు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే వివేక్ చిత్రపటాలకు గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో విలువైన వ్యవసాయ భూములను నష్టపోయిన పరిసర గ్రామాల వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డిని కలువడం జరిగిందని తెలిపారు. అదేవిదంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆనతి కాలంలోనే వారసత్వ ఉద్యోగాలు నియామకం కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు సింగరేణిలో ఉద్యోగవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు ఆసంపల్లి శ్రీకాంత్, తిరుపతి రాజు, కల్కి రమేష్, జైనోద్దీన్, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మన్ పాల్గొన్నారు.

ఉచితంగా మందులు పంపిణీ చేయాలి



నవతెలంగాణ-జైపూర్

సింగరేణిలో పదవీ విరమణ పొంది వివిధ నగరాలలో నివసిస్తున్న వారికి యాజమాన్యం ఉచితంగా మందులు పంపిణీ చేయాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో పేరొన్నారు. హైదరాబాద్ పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సింగరేణి ఉద్యోగ మేళా కార్యాక్రమానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తమ సమస్యను తెలియజేయాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్, సింగరేణి డైరెక్టర్(పా) శ్రీనివాస్‌తో పాటు సింగరేణి గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్‌కు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున వినతి పత్రాలు అందజేసినట్టు తెలిపారు.

సెమీస్‌కు చేరిన ఎస్టీపీపీ క్రికెట్ లీగ్-2024

- ఆదివారంతో ముగియనున్న క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఎస్టీపీపీ క్రికెట్ లీగ్ 2024 సెమీస్‌కు చేరింది. ఈ నెల 1న ప్రారంభించిన పోటీల్లో 12 జట్లు పోటీపడుతుండగా ఇందులో నాల్గు జట్లు సెమీఫైనల్‌కు చేరినట్లు చీఫ్ కోఆర్డినేటర్ పంతులా నాయక్ తెలిపారు. గురువారం తలపడిన జట్ల నుంచి అత్యంత క్రీడా ప్రతిభను కనబర్చిన వారికి ప్లాంట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ బస్విరెడ్డి షీల్డు అందజేశారు. ఈ పోటీల్లో తలపడుతున్న 12 జట్ల నుంచి పవర్‌మేక్ గేమ్ చేంజర్స్ మొదటి నాలుగు స్థానాలను వరుసగా కైవసం చేసుకుని 6 పాయింట్లు సాధించిందని తెలిపారు. అదే విధంగా సోలార్ జట్టు 6 పాయింట్లు, పీఈఎస్ పవర్ హిట్టర్స్ 6 పాయింట్లు, ప్రయివేటు సెక్యూరిటి ఎస్టీపీపీ జట్లు 4 పాయింట్లు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 9 నుంచి క్వాలిఫయర్ ఎలిమినేటర్ మ్యాచ్‌లలో పైన తెలిపిన జట్లు తలపడనుండగా ఇందులో గెలిచిన జట్లు ఆదివారం నిర్వహించనున్న ఫైనల్‌కు చేరకుంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడీ బస్విరెడ్డితో పాటు ఏజీఎం శ్రీనివాస్, చీఫ్ కోఆర్డినేటర్ పంతుల నాయక్‌తో పాటు కోఆర్డినేటర్లు సుబ్బారావు, ఏకే సింగ్ పాల్గొన్నారు.

గాయత్రి కళాశాలలో ఘనంగా వీడ్కోలు వేడుకలు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్

గాయత్రి జూనియర్ కళాశాలలో గురువారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రథమ సంవత్సర విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ , ప్రిన్సిపల్ సురేష్, వెంకట్ లు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థి దశలో మంచి విజయం సాధించినట్లయితే ఉన్నతమైన విద్యకై అర్హత పొంది మంచి ఉద్యోగ స్థాయిలో నిలిచి కళాశాలకు, అధ్యాపకులకు, తల్లితండ్రులకు గుర్తింపు తేవాలన్నారు. మార్చిలో జరిగే ఎగ్జామ్స్ కి అందరూ బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్స్ లతో ఉత్సహ పరిచారు. కళాశాలలో నిర్వహించిన ఆటల పోటీలలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 09, 2024 | www.navatelangana.com

ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ సూచించారు. ఆసిఫాబాద్, రెబ్బెన సర్కిల్లలో నూతన సీఐలుగా బాధ్యతలు స్వీకరించిన సతీష్, చిట్టిబాబు మర్యాదపూర్వకంగా ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ అమలుతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ అనునిత్యం కృషి చేయాలని సూచించారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

నవతెలంగాణ-తాంసి



వచ్చే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. గురువారం గొట్కూరి ప్రభుత్వ పాఠశాలలో సాయంత్రం పదవతరగతి ప్రత్యేక తరగతులను తనిఖీ చేసి విద్యార్థులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మార్చ్ నెలలో నిర్వహించే పదవతరగతి పరీక్షలకు విద్యార్థులను సొంత మేధస్సుతో పరీక్షలు రాసే విధంగా సిద్దం చేయాలని, విద్యార్థులు కూడా శ్రద్ధతో ఒక ప్రణాళికతో చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయూలు వీరేందర్, సిబ్బంది ఉన్నారు.

జాతరలో గట్టి పోలీసు బందోబస్తు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

నాగోబా జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. గురువారం కేస్లాపూర్‌లోని దర్బార్ హాలులో పోలీసులతో బందో బస్తుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి విధుల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. జాతర ప్రారంభం నుంచి ముగిసే వరకు ఆలయంతో పరిసరా ప్రాంతంలో అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఘన్పూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్ఓ రాథోడ్ భగవాన్ దాస్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గాజెందర్ బాధిత కుటుంబానికి పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.

11న వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని సింగరేణి స్కూల్ మైదానంలో ఈ నెల 11న సింగరేణి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 90వ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను బాల, బాలికలు, అధికారులు, వారి సతీమణులు, కార్మికుల సతీమణులకు అదేరోజు సాయంత్రం క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. డిపార్టుమెంటల్ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు కూడా అందజేస్తామన్నారు.

12 నుండి వారంలో నాలుగు రోజులు పత్తి కొనుగోలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనె 12 నుండి పత్తి కొనుగోలు వారంలో నాలుగు రోజులు పత్తి కొనుగొలు చేస్తామని మార్కెటింగ్ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమ, మంగళ, బుధ, గురు వారాల్లో పత్తి కొనుగోలు చేస్వామని, రైతులు ఈ విషయాన్ని గమనించి శుక్ర, శని, ఆదివారాల్లో పత్తి తీసుకొని రావద్దన్నారు. మూడో విడత పత్తి వస్తుందని నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు.

గుర్తింపు కార్డులు అందజేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకం అమలుకు విద్యుత్ సిబ్బంది సర్వే నిర్వహిస్తుర్దని, ఇంటికి వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించి గుర్తింపు కార్డులను అందించేయాలని పర్యవేక్షక ఇంజనీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన దరఖాస్తు రసీదు, రేషన్, ఆధార్‌కార్డు నెంబర్ అందుబాటులో ఉంచుకొని మీ ఇంటికి పరిశీలనకు వచ్చిన అధికారులకు చూపించాలని సూచించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

నవతెలంగాణ-ఓదెల

ఓదెల కేజీబీవీ పాఠశాలలో గురువారం రోజున వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ వైద్య సిబ్బంది అనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా 8,9,10 తరగతుల విద్యార్థులతో పాటు ఇంటర్ విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు.ఇందులో రక్తహీనత గల విద్యార్థులకు తగు సూచనలతో పాటు సరైన పౌష్టికాహారం ఆకుకూరలు,పండ్లు, తీసుకోవాలని రక్త హీనత నివారణ గురించి అవగాహన కల్పించి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు.

ఫిబ్రవరి 16 సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ వద్ద ఫిబ్రవరి 16న జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పోస్టర్‌ను గురువారం రోజున ఆవిష్కరిం చారు. ఇందులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యం రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రతిఘటనగా ఫిబ్రవరి 16న కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంధు నిర్వహించాలని దేశంలోని కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాలు నిర్ణయించాయని అన్నారు. కనీస వేతనం నెలకు 26000 చెల్లించాలని, కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు చేయకూడదని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పచెప్పే తప్పుడు విధానాలను మానుకోవాలని, వ్యవసాయ కూలీలకు వందరోజుల పనిని 200 రోజులకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బి, సంపత్, ఆర్, నగేష్, ప్రశాంత్,ఎం, రాజయ్య, లచ్చయ్య లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

11న సభను విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్

నవతెలంగాణ-కౌటాల

ఈనెల 11న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని మాలీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న కాగజ్‌నగర్ పట్టణకేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల 1996 చట్టం, వలస కార్మికుల 1979 చట్టం రద్దైందని, దీంతో దేశవ్యాప్తంగా రూ.10 కోట్లు, రాష్ట్రంలో రూ.25 లక్షల నిర్మాణ రంగ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు హరించుకుపోయాయన్నారు. వీటిని తిరిగి సాధించడానికి బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని, వెల్ఫేర్ బోర్డుల ద్వారా వసూలైన సెస్సును వారి ఇష్టమొచ్చిన విధంగా బెనిఫిట్స్ ఇచ్చేలా వివిధ రకాల పేర్లు పెట్టుకొనేలా అవకాశం కల్పించారని ఆరోపించారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు ఐక్యంగా ముందుకొచ్చి కేంద్ర బీజేపీ మతతత్వ విధానాలను దిక్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి మోర్లె నాగేష్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జాడె మొరేశ్వర్, మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా అధ్యక్షుడు కొట్రంగి శారద పాల్గొన్నారు.

18న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ టాలెంట్ టెస్ట్

- జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేష్

నవతెలంగాణ-బెజ్జూరు

ఎస్ఎఫ్ఐ కుమురం భీం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న ఎస్ఎస్‌సీ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేష్ తెలిపారు. గురువారం టాలెంట్ టెస్టు కరపత్రాలను మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు 18న టాలెంట్ టెస్ట్ అన్ని మండలకేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 1970 సంవత్సరంలో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ అధ్యాయనం, పోరాటం అనే ఆచరణాత్మక నినాదాన్ని ముందుకు తీసుకెళ్తూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికితీసేలా ప్రోత్సహిస్తుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి అనునిత్యం పోరాడుతూనే విద్యార్థులు చదువులో సైతం ముందుండాలనే పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో జరిగే పబ్లిక్ పరీక్షలో విజయం సాధించాలని రాష్ట్రంలో ప్రముఖ విద్యావేత్తలు చుక్కా రామయ్య, మాజీ శాసన మండలి సభ్యులు డాక్టర్ కె నాగేశ్వర్‌తో నూతన సిలబస్ ఆధారంగా మల్టీపుల్ చాయిస్ రూపంలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో రూపొందించిన ప్రశ్నా పత్రాలతో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వివరాల కోసం ఫోన్ నెంబర్లు 8886561367, 9391945918 సంప్రదించాలన్నారు. టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 16లోపు సంబంధిత ప్రధానోపాధ్యాయుల విద్ద కానీ, ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో కానీ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, పరీక్షలో ప్రతిభ కనబరిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో 10 ర్యాంకులకు గాను ప్రతి మండలానికి మూడు ర్యాంకులకు ప్రత్యేక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కొండ సాయిరామ్, మండల నాయకులు రామగిరి అర్జున్ రాదంది, సాయి, క్రాంతి, ప్రవీన్, రాజు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు

కార్మికులకు నామమాత్రపు వేతనాలు పెంపు సరికాదు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

కార్మికులకు నామమాత్రపు వేతనాలు పెంపు సరికాదని మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్‌లో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో రూపొందించిన విధంగా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్న విధంగా కనీస వేతనం నెలకు 21 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన, పోరాట కార్యక్రమాలు చేస్తే మొక్కుబడిగా, నామమాత్రంగా ఉన్న వేతనంపై నెలకు 1000 రూపాయలు పెంచుతూ సర్క్యులర్ను జారీ చేయడాన్ని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా నిరసిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సావనపెల్లి వెంకటస్వామి, పెద్దపల్లి మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొంకూరి సాగర్, నాయకులు సుద్దాల సతీష్, చింతల మరియా, కుక్క అన్వేష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం నుంచి పెద్దపల్లికి వెళ్లే మార్గం కాసర్లగడ్డ వద్ద గుర్తు తెలి యని ట్రాక్టర్ ఢీకా నడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యా యి. ము త్తారం మండలం పారుపల్లి గ్రామా నికి చెందిన బూ సనవేన రాజేంద ర్, సంగె రమేష్, ఇనుముల సురేష్ గురువారం వ్యవసాయ మందుల కోసం ముత్తారం మండల కేంద్రానికి ద్విచక్ర వాహనం వచ్చే క్రమంలో అతి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టి వెళ్లి పోయింది. ఈ ఘటనలో బూసనవేన రాజేందర్, సంగె రమేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. అదేవిధంగా ఇనుములకు కూడా గాయాలు కావడంతో స్థానికుల సహాయంతో వారిని హుటాహుటిని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. కాగా రాజేందర్, రమేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఎస్ఐ మధుసూదన్ రావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

కాండం తొలుచు పురుగు నివారణపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-ముత్తారం

కాండం తొలుచు పురుగు నివారణపై ముత్తారం మండల కేంద్రంలోని రైతులకు మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ గురువారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని వరి పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వరిలో కాండం తొలుచు పురుగు, జింక్ లోపాలను గుర్తించి నివారణ చర్యలను రైతులకు వివరించారు. కాండం తొలుచు పురుగు నారుమడి దశలో ఆకు చివరలో గుడ్లు పెడుతుందని, గుడ్ల నుంచి లార్వాలు బయటకు వచ్చి కాండం కింద రంధ్రం చేయడం వల్ల మొగి చనిపోతుందన్నారు. కంకి ఏర్పడే దశలో మొగి పురుగు సోకితే కంకి తెల్లబడి గింజలు రాలిపోతాయన్నారు. జింక్ లోపం వల్ల ఆకులలపై ఇటుక మచ్చలు ఏర్పడతాయన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటర్‌కు, క్లోరాంట్రానిలిప్రోప్ 80మిల్లీలీటర్లు ఎకరంకు, ఐసో సైక్లోసీరమ్ 120 ఎంఎల్ ఎకరంకు నీటితో కలిసి పిచికారి చేయాలన్నారు. జింక్ లోపం నివారణకు చెలామిన్ జింక్ 2గ్రాములు లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

నవతెలంగాణ-మంథని

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం మంథనిలో సీఐటీయూ నాయకులు సమ్మె పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మతోన్మాద కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలోని అన్ని కార్మిక సంఘాలు,రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు,గ్రామీణ బంద్‌కు ఇచ్చాయన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు కేవలం 1000 రూపాయల వేతనం పెంచుతామని ప్రకటించడానికి సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.ఇది కేవలం కార్మికుల కంటి తుడుపు చర్య మాత్రమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వడ్లకొండ రాజయ్య, చిప్పకుర్తి చందు పాల్గొన్నారు.

కార్పొరేట్, మతోన్మాద విధానాలను ప్రతిఘటించాలి

నవతెలంగాణ-సుల్తానాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుస రిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాల ప్రతిఘటనగా ఫిబ్రవరి 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య అన్నారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలో సమ్మె పోస్టర్ను సుల్తానాబాద్ రైస్ మిల్ ఆపరే టర్స్, గుమస్తాల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాండ్ర అంజయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, అందుకు కార్మిక వర్గం ఫిబ్రవరి 16న కార్మికుల సమ్మె దేశవ్యాప్త గ్రామీణ బంద్ నిర్వహించాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు రైతు, వ్యవసాయ కూలీల సంఘాలు పిలుపునిచ్చాయని, ఈ సమ్మె పోరాటం లో జిల్లాలోని కార్మికులు, రైతులు,వ్యవసాయ కూలీలు, పేద ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల నాయ కులు రైస్ మిల్ గుమస్తాల సంఘం అధ్యక్షులు మాతంగి రాయమల్లు రైస్ మిల్ ఆపరేటర్ల సంఘం గౌరవ సలహాదారు బండారి స్వామి పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టిపిసిసి కార్యదర్శి, పెద్దపల్లి పార్లమెంట్ నాయకులు పెర్క శ్యామ్ తెలిపారు. పెద్దపల్లి వైట్ హౌస్ లో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆటో డ్రైవర్లు కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేశారని అభినందించారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మరణంలోనూ ఇద్దరి అంధులకు చూపునిచ్చిన శంకరమ్మ

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:

గోదావరిఖనిలోని మేదర బస్తీకి చెందిన పిట్టల శంకరమ్మ గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. మరణంలోనూ తన కుటుంబ సభ్యులు ఇద్దరికీ చూపునివ్వాలని ఉద్దేశంతో ఆ మాతృతమూర్తి నేత్రాలు వృధా కాకూడదని సదాశయ ఫౌండేషన్ ద్వారా రెండు నేత్రాలను దానం చేశారు. చనిపోయిన కూడా ఇద్దరి అంధులకు చూపునిచ్చిన పిట్టల శంకరమ్మ ఆత్మకు శాంతి కలగాలని ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ వారు వేడుకున్నారు.

కుటుంబానికి భరోసా బీమా



నవతెలంగాణ-కౌటాల

బీమా కుటుంబానికి భరోసాగా ఉంటుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మంచిర్యాల రీజినల్ మేనేజర్ మురళీ మనోహర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో బీమా పరిహారం అందజేసే కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం క్రింద సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే సాదారణ మరణం పొందిన రూ.రెండు లక్షల బీమా పరిహారం అందుతుందన్నారు. ఇటీవల మండలకేంద్రానికి చెందిన బసార్కర్ దివాకర్ సాదారణ మరణం చెందడంతో ఆయన భార్య సులోచనకు రూ.రెండు లక్షల బీమా పరిహారం చెక్కును అందజేశారు. ప్రతి ఒక్కరు ఇటువంటి బీమా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి, ముత్తంపేట్ గ్రామీణ బ్యాంకు ఖాతా అధికారి అజేష్, క్షేత్రాధికారి మనోహర్, అకౌంటెంట్ రాజేష్, క్యాషియర్‌లు భాస్కర్, గోపి, సీహెచ్‌పీలు ప్రకాష్, నరేష్, మహిళా సంఘాల ఇన్‌చార్జి ఏపీఎంలు కుసుమ, తిరుపతి, సీసీలు రాజమణి, కల్పన, శంకర్, బ్యాంకు మిత్ర నీరజ, ఖాతాదారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అక్రంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆదిలాబాద్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసు స్టేషన్ పరిధిలోని బాలాజీ గార్డెన్ వెనకల అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం వచ్చింది. సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. 116 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విచారించగా సయ్యద్ షౌకత్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించామని తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా ఎక్కడైన నిల్వ ఉన్నట్లు ప్రజల దృష్టికి వస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

అడవి పందుల దాడిలో పంట నష్టం

నవతెలంగాణ-బోథ్

అడవి పందులు దాడిలో శనగ పంటను ధ్వంసం చేశాయి. మండలంలోని పార్డీ-కే గ్రామానికి చెందిన మెస్రం భూమన్న చేనులోని అడవిపంది దాడిచేసి శనగను పూర్తిగా ధ్వంసం చేశాయని రైతులు ఆవేధన వ్యక్తం చేశారు. పందుల బెడద ఎక్కువగా ఉందని అటవీ అధికారులు తమ పంటలను కాపాడేల చూడాలని కోరుతున్నారు. పంటకు నష్టం పరిహారం అందించేల అటవీ అధికారులు చూడాలన్నారు.

గృహజ్యోతి పథకానికి వివరాలు అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆరు గ్యారంటీల్లో ఒక్కటైన గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత కరెంట్ కోసం సర్వే ప్రారంభం అయిందని, ఇంటికి వచ్చే బిల్లింగ్ ఆపరేటర్లకు వివరాలను అందించాలని ఏఈ తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా పాలన దరఖాస్తు రసీదు, ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు), ఆధార్ కార్డు నెంబర్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

జంగోలింగో మాలదారులకు అన్నదానం

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని శంభో మహాదేవుని ఆలయంలో గురువారం జంగోలింగో దీక్షాదారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుష్యమాసంలో అత్యంత పవిత్రమైన జంగోలింగో దీక్ష దారులు పూజలు నిర్వహిస్తుంటారు. ఈ దీక్షలో కాళ్లకు చెప్పులు లేకుండా ఒక పూట భోజనాలు చేస్తూ ఫిబ్రవరి నెలంతా వారు నియమ నిబంధనలతో, భక్తి శ్రద్ధాలతో ఉంటారు. ఈ అన్నదాన కార్యక్రమంలో దీక్ష పీఠాధిపతి కుమ్ర భగావంత్ రావు పటేల్, ఘన సంస్థాన్ అధ్యక్షులు ఆత్రం రఘునాథ్, కోరేంగ సీతరాం, హనుమంతరావు, పుర్క బాపురావు పాల్గొన్నారు.

వొల్వొ డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి సీఎస్ఆర్‌లో భాగంగా స్థానిక నిరుద్యోగ యువతకు ఓపెన్‌కాస్టలలో నడిచే భారీ యంత్రాలు వొల్వొ డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ కార్యక్రమం సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం ప్రారంభం అయ్యింది. ముఖ్య అతిథిగా ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరై 55 మందికి వొల్వొ డంప్ ట్రక్ శిక్షణ కార్యక్రమాన్ని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వోల్వో డంప్ ట్రక్ శిక్షణను ప్రత్యేకించి హెవి డ్రైవింగ్ లైసెన్స్ అర్హత గల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించుటకు సింగరేణి సీఎస్ఆర్ నిధుల ద్వారా వివిధ ఏరియాల నుంచి ఎంపికైన వారికి టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టిటిసి) ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ అరెల్లి పోషం, సీఎం ఓపిఐ ప్రెసిడెంట్ మల్లేష్, ఎస్ఓటూజీఎం రాంమోహన్ తదితరులున్నారు.

సింగరేణిలో డిపెండింగ్ ఉద్యోగాల సిస్టం మారాలి

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ

సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని డిపెండింగ్ ఉద్యోగాల సిస్టం మారాల్సిన అవసరం ఉందని ఏఐటీయూసీ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి వైవి రావ్ అన్నారు. గురువారం 8వ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని రైతులు,విద్యార్థులకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ రంగ సంస్థలు బ్రతికే పరిస్థితే లేదని అన్నారు. ఈ నెల 16న జరుగు దేశ వ్యాప్త భారత్ బంద్ ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్ ప్రకాష్,ఆర్గనైజింగ్ సెక్రెటరీలు కె.రాజారత్నం, జూపాక రాంచందర్,ఆర్జీ.2 బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవిందర్,ఆర్జీ.3 బ్రాంచ్ కార్యదర్శి ఎంఆర్‌సిరెడ్డి నాయకులు.అన్నారావు, డీటీ రావు, రమేష్, సంపత్, మల్లేష్ పాల్గొన్నారు.